19 గంటలు

సంపత్

ఢిల్లీలోని మిలిటరీ హెడ్‌క్వార్టర్స్‌లో ఇంటలిజన్స్ విభాగంముందు హడావిడిగా వచ్చి ఆగుతున్నాయి రకరకాల కార్లు. దిగుతున్న ప్రతి ఒక్కరి ముఖంలో ఆదుర్దా, ఆశ్చర్యం ప్రస్ఫుటిస్తోంది.

అందరూ కాన్ఫరెన్స్ హాలులోకి దారితీశారు.

ఆ సమావేశానికి ముఖ్యమయిన అధికారులే వచ్చారు. విదేశాంగశాఖ కార్యదర్శి, హోమ్‌శాఖ కార్యదర్శి, మరి కొందరు యితర అధికారులు, ఎయిర్‌ఫోర్స్, ఆర్మీఇంటలి జన్స్ అధికారులుకూడా సమావేశం కావటంతో వారు చర్చించబోయే విషయం ముఖ్యమైనదే అయుండాలని ప్రతివారికీ అవగతమయింది.

కొద్దిసేపు తరువాత హాలు తలుపులు బంధించబడ్డాయి. హోమ్‌శాఖ కార్యదర్శి లేచి గొంతు సవరించుకొని చెప్ప సాగాడు.

"జంటిల్మన్! మీరందరిని యిలా అర్థాంతరంగా పిలి

పించటంలోగల అంతరార్థం మీరీపాటికి గ్రహించే వుంటారు. మనకి ఎక్కువ టైంలేదు గనుక క్లుప్తంగా ముగిస్తాను.

బొంబేనుంచి డెలిహీ బయలుదేరిన విమానాన్ని కొందరు దుండగులు హైజాక్ చేశారు. గతంలో మన విమానాన్ని పాకిస్తాన్ మళ్ళించి కూల్చివేసిన సంఘటన మీకు గుర్తుండే వుంటుంది. ఆ సంఘటన దరిమిలా ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుల్లో సెక్యూరిటీ ఎక్కువచేశాం. ఐనా దుండగులు యెలాగో విమానంలో ప్రవేశించగలిగారు,

ఆ విమానంలో భారతీయులు నలభైరెండు మంది. ఆఫ్రికన్స్ యిద్దరు, అరబ్స్ పదిహేనుమంది, పాకిస్తానీయులు పధ్నాలుగురు, ఆఫ్ఘన్స్ ఏడుగురూ ఉన్నారు. వీరుగాక మిగిలిన ఆరుగురు విమాన సిబ్బంది. పైలెట్స్ యిద్దరు, ఎయిర్ హోస్టెసెస్ యిద్దరు, ఒక ఫస్టుఆఫీసర్, ఒక ఫ్లైట్ ఇంజనీర్.

మొత్తం ఈ ఎనభై ఆరుగురు ప్రాణాలు ఆ దుండగుల చేతులలో వున్నాయి. ఈ 86 గురిలోనే దుండగులు కూడా వున్నారని మరిచిపోవద్దు.

ఇక ఆ దుండగులు ఎందరో, వారి ఆయుధాలేమిటో, వారి కోరికలేమిటో తెలియదు. కనుక దీని విషయమై ఎటువంటి చర్యలు తీసుకోవాలో ఆలోచించవలసినదిగా కోరుతున్నాను.''

కొన్ని క్షణాలపాటు ఆ హాలులో నిశ్శబ్దం ఆవరించింది.

2

''గయ్ం!'' మని శబ్దంచేస్తూ మేఘాలమీదుగా ఎగురుతోంది విమానం.

పైలెట్ రామక్రిష్ణన్, కో-పైలెట్ జోగీందర్‌లు తాము ఎదురుతిరిగి సాధించేది యేమీ లేదని గ్రహించి మౌనంగా విమానాన్ని నడుపుతున్నారు. అయినా వారి మనస్సులో దుండగులను యెలా యెదుర్కోవాలా అన్న ఆలోచన మాత్రం నశించలేదు.

ముఖ్యంగా రామక్రిష్ణన్, నివురుగప్పిన నిప్పులా ఉండి, యేమాత్రం సందుచిక్కినా తమ వెనుక నిలబడివున్న “నెంబర్ త్రీ” మీదకు లంఘించడానికి సిద్ధంగా ఉన్నాడు.

‘నెంబర్ త్రీ’గా పిలవబడుతున్న అతనికి ముప్ఫయేళ్ళ లోపే వుంటుంది వయసు. ముఖం కన్పించకుండా నల్లటి మాస్క్ వేసుకున్నాడు. కళ్ళు, నోరు, ముక్కు మాత్రం కనబడుతున్నాయి. నల్లరంగు ఉలన్ పాంట్, ఆదేరంగు స్వెటర్ ధరించాడు.

మిగిలిన దుండగులు కూడా అదే వయస్సులో అదే డ్రెస్సులో వున్నారు. ఒకరినొకరు నెంబర్లతోనే పిలుచుకుంటున్నారు.

నెంబర్ త్రీ కూడా పైలెట్ కాక్‌పిట్‌లో అలెర్ట్‌గానే వున్నాడు. పైలెట్లుగాని, ఫస్ట్ ఆఫీసర్ మూర్తిగాని తనమీదకు దుమికే అవకాశం యివ్వకుండా జాగ్రత్త పడుతున్నాడు వెయ్యికళ్ళతో కాపలా కాస్తూ.

లోపల ప్రయాణీకులను భయంకరమైన మనఃస్థితి ఆవరించింది. తమకిక నూకలు చెల్లినట్లే నన్న భావం వ్యాపించి నిరాశా నిస్పృహాలతో వేలాడిపోయారు. సీట్లకు అంటిపెట్టుకుపోయిన వారిని నెంబర్ టూ బంధిస్తున్నాడు కదలనీయకుండా.

నెంబర్ ఫోర్ పైలెట్ కాక్‌పిట్‌కి యెదురుగావున్న

సీట్లమధ్య ద్రోవదగ్గర లేవెటరీకి దగ్గర నిలుచుని కాపలా కాస్తున్నాడు. నెంబర్ ఫైవ్, నెంబర్ వన్‌లు మాత్రం అటూయిటూ తిరుగుతూ అందరినీ గమనిస్తున్నారు.

"నెంబర్ వన్" స్పీకర్‌లో విన్పించింది నెంబర్ త్రీ గొంతు.

నెంబర్ వన్ కాక్‌పిట్‌లోనికి పోయాడు. నెంబర్ త్రీ అతనికి తామున్న స్పాట్ చెప్పి, మైక్రోఫోన్ యిచ్చాడు.

'జోధ్‌పూర్' నుంచి వారికి కాంటాక్ట్ అందింది. విమానం హైజాక్ చేయబడిందన్న విషయం తెలియగానే అన్ని ఎయిర్‌పోర్టులకీ ఆ విషయం తెలియచేయబడి, దానిని ట్రేస్ చేయవలసిందిగా కోరారు అధికారులు.

"జోధ్‌పూర్ కంట్రోలింగ్ స్టేషన్ కాలింగ్" అంటూ అరుస్తున్నాడు ట్రాఫిక్ కంట్రోలర్.

"మిస్టర్ కంట్రోలర్!" తాపీగా అన్నాడు నెంబర్ వన్.

"మేము ప్రస్తుతం పాకిస్థాన్ దిశగా ప్రయాణంచేయ వలసి వుంటుంది. వెంటనే వారి అనుమతి సంపాదించండి. ఎలా సంపాదిస్తారో మాకు అనవసరం. లేకపోతే ఏమవు తుందో మీకు తెలుసు."

"అలాగే! అలాగే!" కంగారుగా అన్నాడు కంట్రో లర్. "మీరెందుకు హైజాక్ చేశారు? మీకేంకావాలి?"

"అది తరువాత చెబుతాను. ముందు భారతదేశం వదలాలి. అరగంటలోపు మాకు ఏ విషయమూ తెలపాలి" అంటూ స్విచాఫ్ చేశాడు నెంబర్ వన్.

ఈ సంభాషణ వింటున్న పైలెట్స్ ముఖాలు తెల్లగా పాలిపోయాయి. పాకిస్తాన్! ఈ కుట్రలో పాకిస్తాన్‌కి

భాగముందా? ఉంటే వాళ్ళ అనుమతి ఎందుకు?

అప్పుడు సమయం రాత్రి ఒకటిన్నరదాటి అయిదు నిముషాలయింది.

3

ఇస్లామాబాద్ ఎయిర్‌పోర్ట్ రాడార్ రేంజ్‌లోకి ప్రవేశించింది విమానం.

నెంబర్ వన్, పైలెట్ కాక్‌పిట్‌లోనే వుండి స్వయంగా డైరెక్షన్స్ యిస్తున్నాడు. అతని ఆర్డర్స్, తుపాకి పట్టుకున్న విధమూ చూస్తుంటే – యిటువంటి వ్యవహారాలలో అతనికి మంచి అనుభవం వుండాలని భావించాడు రామకృష్ణన్.

హైజాక్ చేయబడిన విమానంలో తమ దేశీయులు కూడా వున్నారని తెలియడంతో పాకిస్తాన్ కూడా భారత దేశానికి సహాయపడటానికి ముందుకువచ్చింది.

అధికారులకి ఆదేశాలు వెళ్ళాయి. ఆ విమానం ఎక్కడ దిగుతుందో, దానిని ఎలా ట్రేస్ చేయాలో అని ప్రతి వారూ మథన పడుతున్నారు.

మైక్రోఫోన్‌ని తీసుకున్నాడు నెంబర్ వన్. "747 కాలింగ్! 747 కాలింగ్" అని అన్నాడతను.

"రిసీవింగ్ యువర్ మెసేజ్, ప్రొసీడ్ ఓవర్!" అని విన్పించింది ఇస్లామాబాద్ ఎయిర్‌పోర్ట్‌నుంచి.

"ఈ విమానం పూర్తిగా మా ఆధీనంలోవుంది. భారతదేశం మీకన్నీ వివరంగా చెప్పేవుంటుంది. మాకు కావల్సింది మీ ఎయిర్‌రూట్‌లో ప్రయాణించటానికి అనుమతి మాత్రమే. ఇంకేమీ పిచ్చిపనులు చేయకండి. మమ్మల్ని అనుసరించటంగాని, మా గురించి వెతకడం గాని జరిగితే..." అంటూ నవ్వాడు నెంబర్ వన్.

అదిరిపోయాడు గ్రవుండ్ కంట్రోలర్. "నో! నో! మీరు స్వేచ్ఛగా పోవచ్చు. ఎటువెళ్ళాలో చెప్పండి. రూట్‌ని క్లియర్ చేస్తాం!"

ఆదేశంలో "డామిట్! మనం క్రిందికి దిగక తప్పదు!" అన్నారు పైలెట్ రామక్రిష్ణన్.

చటుక్కున ఫోన్ కట్ చేసి "వాట్?" అని అరిచాడు నెంబర్ వన్.

"ఫ్యూయల్ ఐపోయింది!" అన్నాడు రామక్రిష్ణన్.

"అప్పుడే ఎలా అయిపోయింది? ఎక్సెస్ ఉంటుందిగా!"

"ఉంటుంది, నిజమే కాని పాకిస్తాన్ అనుమతికోసం గంటపైలాంగ్ రౌండ్సు చక్కర్లు కొట్టాం!" పెడసరంగా జవాబిచ్చాడు అతను.

విసుగుదల కన్పించింది నెంబర్ వన్ ముఖంలో. నెంబర్ త్రీకి అప్పగించి పాసింజర్స్ కాబిన్ లోకిపోయాడు. నెంబర్ టూతో ఏదో రహస్యంగా చర్చించి తిరిగి కాక్ పిట్ లోకి రాబోయాడు.

"సర్!" అన్న ఎయిర్ హోస్టెస్ పిలుపువిని ఆగి చూశాడు.

"పాసింజర్స్ అంతా భయపడుతున్నారు. ఇఫ్ యూ గివ్ మీ పర్మిషన్... వారికి బ్రేక్ ఫాస్ట్ సర్వ్ చేస్తాను. ఇట్స్ నియర్లీ డాన్!" అంది ఎయిర్ హోస్టెస్ సులక్షణ.

భృకుటి ముడిచి ఏదో ఆలోచించుకుని "ఓ.కె! డోంట్ ట్రై ఎనీథింగ్!" అని నెంబర్ టూ, ఫైవ్‌లకు సైగ చేసి లోనికిపోయాడు.

అదే చాలనుకుని సర్వీస్ రూంలోకి నడిచింది సులక్షణ. ఆమె వెనుకే వచ్చాడు నెంబర్ ఫైవ్.

పేపర్ కప్స్‌లో కాఫీ, టీ, జ్యూస్ మొదలయినవి నింపి ఒక ట్రేలో వుంచి బయటపడింది.

"టేక్ యువర్ సెల్ఫ్ సమ్‌థింగ్ ప్లీజ్!" అంది నెంబర్ ఫైవ్‌తో. వద్దన్నట్లుగా తలూపాడతను.

ఒక్కొక్క పాసింజర్ దగ్గరికిపోయి వారికేం కావాలో కనుక్కొని అందించసాగింది. ప్రాణభయంతోనున్న వారి కవి సహించవని ఆమెకి తెలుసు. వారినా మెంటల్ షాక్ నుంచి డైవర్ట్ చేయాలంటే గత్యంతరం లేదు.

అయిపోయినపుడల్లా లోనికిపోయి నింపుకొని వస్తోంది సులక్షణ. ఆమెని వెయ్యికళ్ళతో గమనిస్తూనేవున్నాడు నెంబర్ ఫైవ్.

లోపల నెంబర్ వన్ ఇస్లామాబాద్ గ్రౌండ్ కంట్రోలర్‌తో మాట్లాడుతున్నాడు.

"ఐడోంట్ లైక్ యువర్ బ్లడీ సజషన్స్! ఐవాంట్ ఫ్యూయల్. క్రిందికి దిగినవెంటనే యెవరూ మాదగ్గరకు రాకూడదు. నేనే మరలా మీతో కాంటాక్ట్ అవుతాను. అండర్‌స్టాండ్!"

"బట్ మిస్టర్! విమానం క్రిందకి దిగగానే యే ప్రమాదమూ సంభవించకుండా అంబులెన్స్, ఫైర్ బ్రిగేడ్ రావటం రివాజు. మీరిలా..."

"షటప్! విమానం తగలబడ్డాసరే! ఒక్క ఫ్యూయల్ టాంకర్ తప్ప వేరేమీ రాకూడదు. అదయినా నేను అనుమతి యిచ్చిన తరువాతే!" అరిచాడు నెంబర్ వన్.

"ఓ.కె! ఓ.కె!" కంగారుగా అన్నాడు కంట్రోలర్.

మైక్ కట్ చేసి నిశ్వశించాడు నెంబర్ వన్. ఎడమచేతిని జుట్టులోనికిపోనిచ్చి దువ్వుకున్నాడు.

స్పీకర్‌లో హెచ్చరించగానే ప్రయాణికులందరూ

సేఫ్టీ బెల్టులు బిగించుకున్నారు.

అతనితోపాటు, అతని అనుచరులుకూడా నిలుచునే ఏదో ఆధారం పట్టుకుని నిలబడ్డారు.

4

ఢిల్లీలో మిలిటరీ క్వార్టర్స్‌లో సీక్రెట్ కాన్ఫరెన్సులు జరుగుతున్న హాలుముందు వచ్చి ఆగాయి రెండుకార్లు.

ఒక కారులోంచి బ్రిగేడియర్ విశ్వనాథ్, మేజర్ ప్రకాష్‌లు, రెండోదాంట్లోంచి కెప్టెన్ చంద్రకాంత్, డిసౌజా, కుమారసాహ్నిలు దిగారు.

వారికోసం వెయిట్ చేస్తున్న ఒకరు వారిని లోనికి తోడ్కొనిపోయారు. అందరికి పరిచయం చెయ్యబడిన తరువాత వారికి విషయం వివరించబడింది.

మధ్యలో పొలికేక పెట్టింది ఫోను. హోమ్‌శాఖ కార్యదర్శి ఫోనులో విన్న సంగతి అందరితో చెప్పాడు.

"ప్లేన్ ఫ్యూయల్ అయిపోవటంతో ఇస్లామాబాద్‌లో దిగటానికి అనుమతి కోరుతున్నారట దుండగులు. అందుకు పాకిస్తాన్ అంగీకరించింది."

ఆర్మీచీఫ్, బ్రిగేడియర్ వంకచూసి "దట్స్ ద మాటర్! మా అందరి ఆశలు మీమీదే వున్నాయి. గతంలోకూడా హిమాలయాలలో 'సీక్రెట్ టౌన్'ని నాశనం చేసి మనదేశం పరువు కాపాడారు. (ఏప్రెల్ '77 సప్లిమెంట్) మీరే మాకిప్పుడు సలహా నిచ్చేవారు!" అన్నాడు.

ఆయన వుద్దేశ్యం అర్థమయింది విశ్వనాథ్‌కి. ఆయనకి సలహా యిచ్చేటంత గొప్పవాళ్ళు కాదు తాము. ఆయన అలా అన్నాడంటే అర్థం ఈ వ్యవహారంలో జోక్యం కల్పించుకోమనే. కాని ఎలా? ఏ విధంగా?

"మీ అభిప్రాయం" అన్నట్లు తన సహచరులవంక చూశాడు బ్రిగేడియర్.

"ఇలా భయపడి వాళ్ళ షరతులకి అంగీకరిస్తే వదులుతారని నమ్మకమేమిటి? రేపు యిలాంటిదే మరొకటి జరిగితే? నో...వాళ్ళకి బుద్ధి చెప్పవలసిందే!" అన్నాడు చంద్రకాంత్.

మిగిలిన వాళ్ళుకూడా అదే తమ అభిప్రాయమన్నట్లు తెలూపారు.

డెసిషన్ అయిపోయింది. ఇక కార్యాచరణలోకి దిగడమే తరువాయి.

కాని ఏ విధంగా? అసలు లోపలవున్న దుండగులు ఎంతమంది? వాళ్ళదగ్గరున్న ఆయుధాలేమిటి? అన్న అనుమానాలు ఉద్భవించాయి.

5

తెల్లవారు ఝాము. సన్నగా కురుస్తున్న మంచును చీల్చుకుంటూ క్రిందకు దిగుతోంది విమానం.

ఆ మంచులో రన్‌వేగాని, సిగ్నల్ లైట్సుగాని స్పష్టంగా కన్పించ లేదు.

ఆ వాతావరణంలోకూడా చెమటలు పడుతున్నాయి పైలట్స్ యిద్దరికి. ఈ పరిస్థితిలో లాండ్ కావడం కష్టమైన పనే!

ఎడమచేత్తో వీల్ పట్టుకొని, కుడిచేతిని థ్రోటిల్ (Throttle) మీద ఉంచాడు రామక్రిష్ణన్. జోగిందర్ కుడిచేతితో వీల్ పట్టుకుని, ఎడమచేతిని థ్రోటిల్ మీద ఉంచాడు.

వారి ముందున్న డయల్స్‌లో ఒకటి తగ్గిపోతున్న ఆల్టిట్యూడ్‌ని సూచిస్తోంది.

చెవులకున్న ఇయర్‌ఫోన్స్‌లో గ్రవుండ్ కంట్రోలర్ డైరెక్షన్స్ వినబడుతున్నాయి.

థ్రోటిల్‌ని నెమ్మదిగా ఒకే లెవల్లో ముందుకు జరుపుతున్నారు యిద్దరు. ముందుకు వాలి పక్షిలా వాలుతోంది విమానం. నెంబర్ వన్, నెంబర్ త్రీలు తూలిపడకుండా గట్టిగా పట్టుకుని నిలుచున్నారు.

రన్ వేని తాకాయి టైర్లు. కీచుమంటూ 'వే'ని రాచుకొని వేగంగా పరుగుతీయ సాగాయి అవి.

పైలెట్స్ చేతులు థ్రోటిల్‌ని వదిలి బ్రేక్స్ మీదకు దారితీశాయి.

రన్ వేకి అటూయిటూ వున్న సిగ్నల్ లైట్సు డైరెక్షన్స్ ఇస్తున్నాయి. కొంతదూరం పరుగెత్తిన అనంతరం బ్రేక్సు అప్లై చేశాడు రామక్రిష్ణన్.

మరో ఐదు నిముషాలనంతరం ఇంజన్స్‌తోబాటు ఆగిపోయిన విమానం ఒంటరిగా నిలబడివుంది.

6

పైలెట్ కాబిన్‌నుంచి దూరంగా కనబడుతున్న విమానాశ్రయ భవనాలను గమనిస్తున్నాడు నెంబర్ వన్. మిగిలిన నలుగురు లోపల కాచుకుని ఉన్నారు.

ప్రయాణీకులకు తాము యెక్కడ దిగినదీ అర్థంగాక తెల్లబోయి చూస్తున్నారు. పరిసరాలను గుర్తుపట్టడానికి ప్రయత్నిస్తున్నారు మరికొందరు.

చుట్టూ అద్దాలమీద మంచు పేరుకుంటోంది పల్చగా.

తన అనుచరులను హెచ్చరించి, రేడియోఫోన్ స్విచ్ ఆన్ చేశాడు నెంబర్ వన్.

"హియర్ మీ కేర్‌ఫుల్లీ!" ఒక్కొక్కమాటే స్పష్టంగా, మెల్లిగా పలుకుతున్నాడు నెంబర్ వన్.

"ప్రస్తుతం మా చేతులలో రివాల్వర్లు, స్టెన్‌గన్స్, గ్రెనేడ్స్ సిద్ధంగా వున్నాయి. అవి ప్రయాణీకులకు గురి పెట్టబడివున్న సంగతి మీరు గ్రహించగలరు.

ఇప్పుడు టైం సరిగ్గా అయిదుగంటలా ముప్పైఒక్క నిముషం అయింది. అయిదూ యాభైకి ఆయిల్ టాంకర్ ఒక్కటే...రిపీట్ ఆయిల్ టాంకర్ ఒక్కటే బయలు దేరి విమానాకి ఎదురుగా, అంటే పైలెట్ కాబిన్‌కి ఎదురుగా రావాలి. విమానానికి ఇరవై అడుగుల దూరంలో ఆగాలి.

లోపల డ్రయివర్ తప్ప ఇంకెవ్వరూ ఉండకూడదు. సరిగ్గాఆరుగంటలకి విమానాన్ని సమీపించి ఫ్యూయలింగ్ జరపాలి. తిరిగి వెళ్ళేటప్పుడు ఇదే విధంగా పోవాలి. ఈలోగా వెనకనుంచిగాని, ప్రక్కనుంచిగాని మమ్మల్ని సమీపించటానికి ప్రయత్నించకండి. అండర్‌స్టాండ్."

"ఆల్ రైట్! మీ మాటలు టేప్ చేశాం. మీరు కోరిన ప్రకారం జరుగుతుంది." హామీయిచ్చాడు అతను.

అంతా నెంబర్ వన్ చెప్పినట్లే ప్రవర్తించారు అధికారులు. రీఫ్యూయలింగ్‌కి సరిగా ముప్పైఅయిదు నిముషాలు పట్టింది. ఈ అరగంట కాలమూ ముళ్ళమీదున్నట్లు గడిపారు దుండగులు.

రామక్రిష్ణన్‌లో తిరగబడాలన్న కోరిక మరింత బలపడసాగింది. ఏదో ఒకటి చేసేయాలన్న ఉద్దేశ్యంతో వున్నాడతను.

ఫ్యూయలింగ్ ముగించి టాంకర్ తిరిగి వెళ్ళిపోసాగింది. ఆ సమయంలోనే నెంబర్ వన్ కళ్ళు రెండు సెకనులు పాటు దానిమీదే కేంద్రీకృతమయ్యాయి.

అవకాశం కోసం కాచుకొనివున్న రామక్రిష్ణన్ ఎగిరి

తుపాకీ పట్టుకొన్న నెంబర్ వన్ చేయిమీద కొట్టాడు.

దిమ్మెరపోయి రివాల్వర్‌ని వదిలేశాడు నెంబర్ వన్.

అతడిమీదకు దూకాడు రామక్రిష్ణన్. పిడికిలి బిగించి అతని పొట్టలో గుద్దాడు. పొట్ట పట్టుకొని వాలిపోయాడు నెంబర్ వన్. అతన్ని పైకిలేపి మరొక కిక్ యిచ్చాడు.

'దబ్బు'మని కాక్‌పిట్ తలుపులకి గుద్దుకొని బయటకు దొర్లాడు నెంబర్ వన్.

'కెవ్వు' మన్నారు పాసింజర్స్.

ధన్ ధన్ ధన్ ...మంటూ గర్జించాయి నెంబర్ ఫోర్, టూల చేతిలోని స్టెన్‌గన్స్.

భయంకరమైన చప్పుడుతో దద్దరిల్లిపోయిందివిమానం. గుమ్మంలో నిలుచునివున్న రామక్రిష్ణన్ వళ్ళు తూట్లుపడి పోయింది.

7

''యా అల్లా! వాటీజ్ ఇట్!'' మైక్రోఫోనులో తనకు వినబడిన శబ్దాలను తలుచుకుంటూ కంగారుగా అడిగాడు గ్రవుండ్ కంట్రోలర్.

''పైలెట్ యెదురు తిరిగాడు. చంపేశాం!''క్లుప్తంగా అని, ఫోన్ కట్ చేసి, నోటికి అయిన రక్తంని తుడుచుకున్నాడు నెంబర్ వన్.

''మిస్టర్! ఇప్పుడీ విమానాన్ని యెలా నడపడం?'' అని ప్రశ్నించాడు జోగిందర్.

''నెవర్ మైండ్! నెంబర్ ఫైవ్ వున్నాడు'' అనటంతో ఈ వంకతోనయినా ఇక్కడ ఆగిపోవచ్చునుకున్న జోగిందర్ ఆశ అడియాస అయింది.

లోపల ప్రయాణికులస్థితి మరింత హృదయ విదారకంగా తయారయింది. చాలామంది భయంతో స్పృహ

కోల్పోయారు. ఒకరిద్దరికి వాంతులయాయి, రామక్రిష్ణన్ శవం చూసి.

సులక్షణ బుర్ర శూన్యం అయిపోయినట్లయింది.

నంబర్ వన్ పిలవగానే నంబర్ ఫైవ్ వెళ్ళి పైలెట్ సీటులో కూర్చున్నాడు.

“అన్నా! మా పని ముగిసింది. క్లియరెన్స్ యివ్వండి. ఆఫ్ఘనిస్తాను వైపు పోవాలి!” అని మైక్రోఫోనులో చెప్పాడు నంబర్ వన్.

అయిదు నిముషాల తరువాత క్లియరెన్స్ యిచ్చారు. జోగిందర్ యింజన్స్ స్టార్ట్ చేశాడు.

గర్ గర్ మంటూ తిరగ నారంభించాయి ఎడమ రెక్క చివరవున్న ఇంజను ప్రొపెల్లర్స్. దాని తరువాత కుడి రెక్క రెండవ ఇంజను స్టార్టయింది. పిదప యెడమ రెక్కలో మిగిలిన రెండో యింజను తిరగనారంభించింది. ఇక నాలుగో యింజను మిగిలింది.

జోగిందర్ చేతులు గబగబ స్విచస్ నొక్కుతున్నాయి. కాని ఆ ఇంజను స్టార్టు కావటం లేదు. గబగబా యేవో నొక్కుతున్నాడు. లాభం లేకపోయింది.

అనుమానంగా చూస్తున్నాడు నంబర్ వన్.

“సమ్‌థింగ్ రాంగ్!” అన్నాడు జోగిందర్ చివరకి.

ఉరిమినట్లు చూసి “నంబర్ ఫైవ్! నువ్వు ట్రయ్ చెయ్” అన్నాడు నంబర్ వన్.

అతని ప్రయత్నం కూడా బూడిదలో పోసిన పన్నీరు అయింది. ఇంజను స్టార్టు కావటం లేదు.

“కొంపదీసి ఈ మూడింటిలోనే వెళ్ళదామనడు గదా!” అనుకున్నాడు జోగిందర్.

ఆ ఆలోచన వారికి వచ్చినట్లు లేదు.

విమానం కదలలేదు. లోపల స్పృహలోవున్న ప్రయాణీకులకు ఇది గమనించే ఓపిక లేదు. శూన్యదృక్కులను చూస్తున్నారు.

8

సర్ మంటూ రెండు మిలిటరీ జీపులు వచ్చి ఆగాయి ఆ విమానం ప్రక్కగా.

లోపల నుంచి అయిదుగురు మనుషులు దిగారు. వారి దుస్తులు ఆ చీకటిలో కలిసిపోయినట్లున్నాయి.

"బ్రిగేడియర్! మీరు కోరిన ఏర్పాట్లు చేశాము. ఇప్పుడు మీ అయిదుగురి ప్రాణాలేకాక, ప్రయాణీకుల ప్రాణాలు, మన దేశం పరువూ క్లిష్టపరిస్థితిలో వున్నాయి. వారికేదయినా అయితే ఏమవుతుందో బాగా తెలుసు. కనుక బి కేర్ ఫుల్! విష్ యు బెస్ట్ ఆఫ్ లక్!" అని కరస్పర్శ చేశాడు ఆర్మీచీఫ్.

తల వూపి విమానం ఎక్కారు అయిదుగురు. వారి కోసమే ఏర్పాటు చేయబడిన ఆ స్పెషల్ ప్లేన్ మరి కొద్దిసేపటి తరువాత గాలిలోకి లేచింది.

*   *   *

స్టార్టయిన యింజన్స్ ఆగిపోవటం గమనించి, విస్తుపోయింది సులక్షణ. ఏం జరిగింది?

"హలో! హలో!" అంది మైక్రోఫోన్ స్పీకర్.

"ఏమిటి?" చిరాగ్గా ప్రశ్నించాడు నంబర్ వన్.

"క్లియరెన్స్ యిచ్చాం! ఇంకా బయలుదేరరేమిటి?" అన్నాడు.

"జస్ట్ సమ్ రిపేర్."

"మెకానిక్స్‌ని పంపమంటారా?"

"నో! మేము సరిజేసుకోగలం." కఠినంగా అన్నాడు

నంబర్ వన్.

"మీరా! అవి చాలా సున్నితమైన యంత్రాలు. ఏ వైర్ తెగినా..."

"షటప్! ఐ నో యిట్!" గర్జించాడు నంబర్ వన్.

చెవుల తుప్పు వదిలినట్లయింది గ్రౌండ్ కంట్రోలర్‌కి.

"నంబర్ ఫైవ్! ఆ యింజన్‌ని బాగుచేయగలమా?" అని ప్రశ్నించాడు.

"ఏ సంగతీ పరీక్షిస్తేగాని చెప్పలేను!"

ఏదో ఆలోచించి "వెంటనే వాన్ ఒకటి, ఖాళీది పంపండి. డ్రయివర్ ఒక్కడే వుండి, యిందాక ఆయిల్ టాంకర్ వచ్చిన విధంగానే రావాలి!" అంటూ ఫోన్‌లో ఆజ్ఞలు జారీ చేశాడు నంబర్ వన్.

అన్నట్లుగానే ఏడు నిముషాల తరువాత ఒక వ్యాన్ వచ్చి ఆగింది. డ్రైవర్ క్రిందకి దిగి నిలుచున్నాడు.

"నంబర్ టూ! చెకప్!" అన్నాడు కాబిన్ స్పీకర్లో నంబర్ వన్.

వెనుకనున్న డోర్ తెరుచుకుని నంబర్ టూ క్రిందకి జంప్ చేశాడు.

అప్పటికి వుదయం అరగటంవల్ల మంచు తెరలు కరిగి పోతున్నాయి. పల్చని ఎండ మంచు తెరలని చీల్చుకొని ప్రసరిస్తోంది.

డ్రైవర్ దగ్గర ఆయుధాలేమీ లేవని తెల్సుకొని నంబర్ వన్‌కి సైగ చేశాడు 'టూ'.

"మిస్టర్ పైలెట్! నంబర్ ఫైవ్. గో! క్విక్!" అన్నాడు.

"సారీ! ప్రయాణీకులతోపాటు ఫ్లైట్ ఇంజనీర్ వున్నాడు. అతన్ని పంపండి" అన్నాడు జోగిందర్.

నంబర్ ఫైవ్ పాసింజర్ కాక్ పిట్ లోకి నడిచి, సులక్షణద్వారా ఫ్లైట్ ఇంజనీర్ ని తీసుకొని బయట పడ్డాడు.

ఈలోగా నంబర్ టూ డ్రైవర్ ద్వారా వ్యాన్ ని చెడి పోయిన రెక్క ముందు క్రిందుగా ఆపించి, డ్రైవర్ ని కొద్ది దూరంలో దిగి నిలబెట్టాడు.

వ్యాన్ పైకి ఎక్కి యింజన్ ని పరీక్షించసాగారు ఫ్లైట్ ఇంజనీర్, నెంబర్ ఫైవ్ లు. అరగంట ప్రయత్నం అనంతరం డిఫెక్టుని కనుక్కోగలిగారు. దానిని సరిజేసి వూపిరి పీల్చుకున్నారు. మధ్యలో ఆగిపోతుందన్న భయం మాత్రం ఫ్లైట్ ఇంజనీర్ మెహిందర్ సింగ్ కు కలగక పోలేదు.

వ్యాన్ క్రిందకు దిగి జేబులో చేయి పెట్టుకున్నాడు మెహిందర్ సింగ్.

తమవద్ద ఆయుధాలు ఏమీ లేవన్న సంగతి వాళ్ళెప్పుడో చెక్ చేసి గ్రహించారు.

"మె ఐ స్మోక్?" అన్నాడు మెహిందర్.

తలూపాడు నంబర్ టూ. జేబులో నుంచి సిగరెట్ పాకెట్ తెరిచి, ఒకదానిని నోట్లో వుంచుకుని, సిగర్ లైటర్ తో వెలిగించుకున్నాడు.

అతనివల్ల ప్రమాదం లేదని తీర్మానించుకొని అడుగులు వేశాడు నంబర్ టు.

ప్యాకెట్టు జేబులో వుంచుకోబోయి క్రిందకి జార విడవటం అతను గమనించలేదు గాని, డ్రైవర్ మాత్రం చూసి కళ్ళు విప్పార్చాడు. ఏమిటది? ఏదో పడిపోయింది.

విమానం వెళ్ళిన తరువాత దానిని చూశాడు. సిగరెట్ పాకెట్. లోపల అయిదు సిగరెట్లు మాత్రం వున్నాయి.

9

“బ్రిగేడియర్! మెసేజ్ వచ్చింది” అని పిలిచాడు పైలెట్ స్పీకర్లో.

విశ్వనాథ్ లేచి పైలెట్ కాక్‌పిట్‌లోకి నడిచాడు.

“హలో బ్రిగేడియర్! విమానం యింజన్‌లోని డిఫెక్టును బాగుచేసుకున్నారట. ఆ దుండగులలో ఒకడు, మరో మనిషి—వాళ్ళు చెప్పిన పోలికల ప్రకారం పెట్రోల్ ఇంజనీర మెహిందర్‌సింగ్ క్రిందకి దిగి సరిచేశారట” అని చెప్పాడు ఆర్మీచీఫ్.

“డామిట్!” అనుకున్నాడు విశ్వనాథ్. తమ పని ఇస్లామాబాద్‌లోనే పూర్తవుతుందని అతను ఆశిస్తున్నాడు యింతవరకు.

తిరిగి విన్పించింది ఆర్మీ చీఫ్ గొంతు.

“అంతేగాదు! తిరిగి వెళ్ళేటప్పుడు మెహిందర్ చేతిలో నుంచి సిగరెట్ పాకెట్ జారి పడటం గమనించి, దానిని చూశాడు డ్రైవర్. దానిలో అయిదు సిగరెట్లు వున్నాయట. అతను కావాలనే క్రిందకి జార విడిచాడని డ్రైవర్ అంటున్నాడట.”

అది వినగానే అనేక ఆలోచనలు ఉవ్వెత్తున లేచాయి విశ్వనాథ్ మదిలో.

అయిదు సిగరెట్లు! దేనిని సూచిస్తున్నాయి? లోపల వున్న దుండగుల సంఖ్యనా? లేక తాము ప్రయాణించే దూరాన్నా? లెక ఏదయినా టైమ్ లిమిట్‌నా?

“ఇంతకీ... వారి కోరిక లేమిటో తెలియచేశారా?” అన్నాడు విశ్వనాథ్.

“ఇంకా లేదు” అన్నాడు ఆయన.

10

హైజాక్‌డ్ విమానం పాకిస్తాన్ భూభాగం దాటి ఆఫ్ఘనిస్తాన్ ఎయిర్ ఫీల్డ్‌లోనికి ప్రవేశించింది.

ఈ విషయం ఆఫ్ఘన్ అధికారులకి తెలియజేసి, ఆ క్షణం నుంచి ఇండియన్ అఫీషియల్స్‌తో కాంటాక్టు అయివుండవలసిందిగా కోరింది పాకిస్తాన్. ఇండియా కూడా సహాయాన్ని అర్థించటంతో సహాయానికి ముందు వచ్చింది ఆఫ్ఘన్ ప్రభుత్వము.

వెంటనే హైజాక్‌డ్ విమానం కోసం ప్రయత్నాలు జరిగాయి. అప్పటి కప్పుడు కాబూల్ విమానాశ్రయాన్ని ఖాళీ చేయించి రాబోయే విమానం కోసం ఎదురుచూడసాగారు ఆఫ్ఘన్ అధికారులు.

విమానం కాబూల్ ఎయిర్‌పోర్ట్ రాడార్ రేంజ్ లోనికి ప్రవేశించటంతోనే అక్కడ టెన్షన్ పెరిగింది.

"హలో! హలో! జిసిజె కాబూల్ గ్రౌండ్ కంట్రోల్. యువర్ ఐడెంటిటీ ప్లీజ్!" అంటూ తనని తాను పరిచయం చేసుకున్నాడు గ్రౌండ్ కంట్రోలర్. వెంటనే జవాబు వచ్చింది. తామెవరో తెలియజేసి, డైరెక్షన్స్ యిచ్చి, "వుయ్ వాంట్ క్లియరెన్స్ టు ఆఫ్రికా! వాంటెడ్ వెదర్ రిపోర్ట్, విండ్ డైరెక్షన్స్" అంటున్నాడు నెంబర్ ఫైవ్.

చెడిపోయిన ఇంజను కూడా ఎటువంటి ట్రబుల్ ఇవ్వలేదు. నెంబర్ వన్ ముఖంలో ఇప్పుడు నెర్వస్‌నెస్ పోయి ప్రశాంతత కనబడుతోంది.

"నెంబర్ వన్!" అని వెనకనుంచి నెంబర్ టూ గొంతు వినబడటంతో వెనుదిరిగాడు నెంబర్ వన్. అతని చెవిలో ఏదో చెప్పాడు నెంబర్ టూ. ఇద్దరూ పాసిం

జర్స్ కాబిన్ లోకి పోయారు.

సులక్షణ లేచి నిలుచుని ఉంది. ఆమె ముఖం తెల్లగా పాలిపోయి వుంది. పెదాలు అదురుతున్నాయి.

"యస్. వాట్ యు వాంట్?" అన్నాడు నెంబర్ వన్.

"మిస్టర్! పాసింజర్స్ కి మెంటల్ షాక్ తగిలింది. ముఖ్యంగా యిద్దరి పరిస్థితి మరీ సీరియస్ గా ఉంది. ఫస్ట్ ఎయిడ్ చేశాను. కాని వారికి వెంటనే మెడికల్ ఎసిస్టెన్స్ కావాలి. ప్లీజ్!" అంది ఆమె దీనంగా.

నెంబర్ వన్ పడిపోయివున్న యిద్దరు మనుషులను పట్టి మరీ పరీక్షించాడు. ఆమె చెప్పింది నిజమే నన్పించింది. ఒళ్ళు సలసల కాగుతోంది వారికి. పల్స్ మరీ బలహీనంగా కొట్టుకుంటోంది.

మిగిలిన పాసింజర్ల వంక చూశాడు వన్.

అందరి పరిస్థితి అంతే అయినా, వారిద్దరికంటె ఫరవాలేదు.

కాక్ పిట్ లోకి నడిచి మైక్రఫోన్ చేతిలోకి తీసుకున్నాడు నెంబర్ వన్.

"మేమిక్కడ లాండ్ అవదల్చుకున్నాం. లోపల సిక్ పీపుల్ యిద్దర్ని దించాలి. అంబులెన్స్ తో రెడీగా ఉండండి. నేను చెప్పేవరకు ఎవరూ విమానాన్ని సమీపించకూడదు. అండర్ స్టాండ్!" అని చెప్పాడు.

నోట్ చేసుకుంటున్న అతని మాటలు, వివరాలు ఎప్పటి కప్పుడు భారత ప్రభుత్వానికి అందించబడుతున్నాయి. అవి విమానంలో వస్తున్న బ్రిగేడియర్ బృందానికి తెలియ చేయబడుతున్నాయి.

11

"మైగాడ్!" అరిచాడు జోగిందర్.

ఉలిక్కిపడి చూశారు అందరు అతని వంక.

"వాట్ హేపెండ్?" కరుగ్గా ప్రశ్నించాడు నెంబర్ వన్.

"వీల్ లాండింగ్ అవుటాఫ్ ఆర్డర్‌లోవుంది. బెల్లీ లాండింగ్ చేయాల్సి వుంటుందేమో!" అన్నాడు జోగిందర్.

నెంబర్ ఫైవ్ చెక్ చేసి ఆ విషయం ధృవపరచటంతో గుండాగి నట్లయింది నెంబర్ వన్ కి.

విమానం దిగబోయే ముందు అడుగున బెల్లీలోవున్న తలుపులు తెరుచుకోవాలి. లోపలకి ముడుచుకు పోయిన వీల్స్ బయటికి సాగాలి. అలాగే వెనుక కూడా. అవి ఫిక్స్ అయిన తరువాతే దిగాలి.

ఈ ప్రాసెస్ అంతా రివర్స్‌గా సాగుతుంది పైకి లేచిన తరువాత. ఈ సిస్టమ్ అంతా ఒక దాంతో ఒకటి ముడిపడి ఉన్నందువల్ల మధ్యలో ఏ అవాంతరం వచ్చినా మొత్తం అంతా గల్లంతయ్యే అవకాశం ఉంది.

అటువంటి పరిస్థితులలో చేసేది బెల్లీ లాండింగ్. అంటే వీల్స్ లేకుండా దిగడం. ఏ ఇసుకమీదనో నేల మీదనో. నిజానికి లాండింగ్ సిస్టమ్ అంటే ప్రాణాల మీద ఆశవదులుకొని చివరి ప్రయత్నం అన్నమాటే!

"హర్రీ! హర్రీ!" అరుస్తున్నాడు నెంబర్ వన్.

నెంబర్ ఫైవ్, జోగిందర్‌లు శత్రుత్వాన్ని మరిచి కూడా వీల్స్ తెరవటానికి విపరీత ప్రయత్నాలు చేస్తున్నారు. అరగంట ప్రయత్నం మీద ముందు వీల్స్ మాత్రం వచ్చాయి.

ఈ విషయం తెలియగానే విమానాశ్రయ అధికారులు అదిరి పోయారు. బెల్లీ లాండింగ్ అంటే గత్యంతరం లేక, ఆశచావక క్రిందికి దిగే ప్రయత్నం అని వారెరు

గనిది కాదు.

"దిగకుండా పోతేనో?" అన్న ఆలోచన కూడా రాకపోలేదు నెంబర్ వన్‌కి. కాని తమ డెస్టినేషన్‌లో మాత్రం ఈ సిస్టమ్ పని చేస్తుందని గ్యారంటీ ఏమిటి?

అతనెటూ తేల్చుకునే లోపే క్రిందకి దిగ నారంభించింది విమానం.

జోగిందర్, నెంబర్ ఫైవ్‌ల చేతులు థ్రోటిల్ మీద, హాఫ్ సర్కిల్‌గా ఉన్న వీల్ మీద స్థిరంగా ఉన్నాయి.

జోగిందర్ కళ్ళముందు ఏటవాలుగా రన్‌వే గోచరిస్తోంది. క్షణక్షణానికి రన్‌వేని సమీపిస్తోంది.

రెండు క్షణాల తరువాత రన్‌వేని తాకాయి ముందు వీల్స్. కొంతదూరం పరిగెత్తిన తరువాత వెనుక వీల్స్ తాకటమే తరువాయి. అదే క్షణంలో ఇద్దరు వీల్‌ని బలంగా ఎడమవైపుకి తిప్పేస్తారు. వెనుక భాగం నేల మీదకి వాలక ముందే ప్రక్కనున్న ఇసుక లోనికి దిగింది విమానం.

వెనుక ఫ్యూజ్‌లేజ్ నేలని తాకేలోపే కొంతదూరం దూసుకుపోయి, ఇసుకలో కొంత కూరుకుపోయింది విమానం.

సడన్‌గా ఆగటంతో ముందుకి తూలిపడ్డాడు, నెంబర్ ఫైవ్‌తోసహా అందరూ. ప్రయాణికుల కేకల సంగతి చెప్పనక్కరలేదు.

చుట్టూ లేచిన ఇసుక తెరల మాటున పెద్ద కుదుపుతో ఆగిపోయింది విమానం.

12

విమానం నేలని తాకీ తాకటంతోనే పరుగులు పెట్టాయి అంబులెన్స్, ఫైర్ బ్రిగేడ్ వాన్స్. అది

ఏ క్షణంలో నయినా పేలిపోవచ్చు. లేదా మంటలలో మాడిపోవచ్చు.

కాని సగం దూరం కూడా పోకముందే "స్టాప్! స్టాప్!" అంటూ గోల పెట్టాడు గ్రౌండ్ కంట్రోలర్.

"ఎందుకు?" అని వాకీ - టాకీలో ప్రశ్నించారు అంబులెన్స్, ఫైర్ ఇంజన్ అధికారులు.

"విమానంని సమీపించవద్దని ఆజ్ఞాపిస్తున్నారు. వెడితే విమానాన్నే పేల్చేస్తామంటున్నారు. కం బాక్. హారియప్," అరుస్తున్నాడు అతను.

వెనక్కి తిరగక తప్పలేదు. ఈ విషయం తెలిసిన బ్రిగేడియర్ బృందం చకితులయ్యారు.

"డేర్ డెవిల్స్!" అనుకున్నాడు ప్రకాష్, విమానంని నడిపిన పైలెట్స్‌ని తలుచుకుని.

వాన్స్ వెనక్కి మళ్ళటం చూసి తృప్తిగా తలాడించాడు నంబర్ వన్.

వాన్స్ వెనుదిరిగిన తరువాత నంబర్ ఫైవ్ వంక పరిశీలనగా చూశాడు. అతని ప్రాణాలుపోయి ఎంతో సేపు అవుతోంది. ముఖం అంతా రక్తమయం అయిపోయి భయంకరంగా ఉంది.

జోగిందర్‌కి గాయాలు తగిలినా, నాడి ఆడుతూనే ఉంది బాగా. ఫస్టు ఆఫీసర్ మూర్తి కూడా బాగానే వున్నా స్పృహ కోల్పోయాడు.

కాక్‌పిట్ తలుపులు తెరుచుకొని పాసింజర్స్ కాబిన్‌లోకి వచ్చాడు. పాసింజర్సంతా అడ్డదిడ్డంగా పడిపోయి కనబడుతున్నారు. అతని సహచరులు తలో మూలపడి వున్నారు. బహుశా దెబ్బతినకుండా నిలదొక్కుకుంది నంబర్ వన్నే అయివుండాలి.

వెంటనే నంబర్ వన్ తన మనుషులకు స్పృహ తెప్పించే ప్రయత్నంలో మునిగిపోయాడు.

నంబర్ ఫైవ్ మరణించాడని విని దిగ్భ్రమ చెందారు వాళ్ళు.

"ఎన్ని కష్టాలు పడయినా మన కార్యం సాధించాలి." అన్నాడు గంభీరంగా నంబర్ వన్.

అప్పుడే ఎయిర్ హోస్టెస్ 'దీప'కి కూడా స్పృహ వచ్చింది. వచ్చీ రావటంతోనే 'సులక్షణ'కి తెలివి రప్పించింది.

సులక్షణ తెలివి రాగానే చేసిన మొదటిపని సీరియస్ కండిషన్‌లో ఉన్న ఇద్దరు ప్రయాణికులను పరీక్షించటం. వారిద్దరు ప్రాణాలుకోల్పోయి చాలా సేపవుతుంది.

అదే సమయంలో ఎవ్వరో 'కెవ్వు'న అరచిన అరుపుకి విమానం అంతా దద్దరిల్లి పోయింది.

అదిరిపడి చూశారు హైజాకర్స్.

ఒకమూల ఉన్న పాసింజర్ ఒకత్తె గిలగిల కొట్టుకుంటోంది.

నిస్సహాయంగా నంబర్ వన్ వంక చూసింది సులక్షణ.

అతని ముఖంమీద చిరాకు, కోపం కనబడుతోంది. నిరాశని పోగొట్టుకోవటానికి విపరీతంగా ప్రయత్నిస్తున్నాడని తెలుస్తోంది.

ఏదో నిశ్చయం చేసుకుని కాక్‌పిట్‌లోకి నడిచాడు.

"నేను చెప్పేది జాగ్రత్తగా వినండి..." అంటూ ఫోన్‌లో చెప్ప నారంభించాడు.

13

ఉదయం పదిగంటల ఇరవై ఆరునిమిషాలయింది.

కాబూల్ విమానాశ్రయం చడీచప్పుడు లేకుండా,

ఎర్రని ఎండలో భయంకరమయిన నిశ్శబ్దంలో మునిగిపోయి ఉంది. దూరంగా ఆగివున్న హైజాక్డ్ విమానం తళ తళ లాడుతూ మెరుస్తోంది.

అత్యవసరమయిన సర్వీసుల్ని తప్ప, మిగిలిన వాటిని రద్దుచేశారు అధికారులు. ప్రతివారిలోనూ ఆందోళన, ఆదుర్దా గూడుకట్టుకొని వున్నాయి.

అప్పుడే విమానాశ్రయం భవనాలనుంచి ఒక తెల్లని అంబులెన్సు బయటకువచ్చి ఆగిపోయివున్న విమానం దిక్కుగా పరుగెత్త నారంభించింది. లోపల ఒకే ఒక మనిషి ఉన్నాడు.

మరికొద్ది సేపటి తరువాత విమానం రియర్ డోర్‌కి కొద్ది దూరంలో రన్ వే మీద ఆగిపోయింది. డ్రయివర్ క్రిందకి దిగి తలమీద చేతులు పెట్టుకొని నిలబడ్డాడు, అంబులెన్సు తలుపులు తెరిచి.

నంబర్ వన్ కాక్‌పిట్‌లోనే ఉన్నాడు.

తెరిచి ఉన్న రియర్ డోర్‌కి అటూ యిటూ సిద్ధంగా నిలుచుని వున్నారు నంబర్ ఫోర్, నంబర్ త్రీలు.

నంబర్ టూ అందరినీ కవర్ చేస్తున్నాడు.

"ఊఁ!" అని నంబర్ టూ సైగ చేయటంతో సులక్షణ, దీపలు డోర్ దగ్గరికి నడిచి క్రిందకి దిగారు. అంబులెన్సు దగ్గరకుపోయి స్ట్రెచర్ తెచ్చారు. దానిలో సీరియస్‌గా ఉన్న పేషంటుని ఉంచి మరల క్రిందకి తీసుకుపోయారు. వాళ్ళిద్దరు వెళ్ళేటప్పుడే హెచ్చరించాడు నంబర్ టూ.

"మిస్! అంబులెన్సుతోపాటు వెళ్ళిపోవటానికి ప్రయత్నించకండి. అది మీకే ప్రమాదం!" అని. తలూపారు యిద్దరు.

అలాగే రామక్రిష్ణన్ శవాన్ని, చనిపోయిన ఇద్దరి

శవాలని కూడా అంబులెన్స్ లోనికి చేర్చటం జరిగింది.

దీప, సులక్షణలు విపరీతంగా అలసిపోయారు. అంబులెన్స్ తలుపులు మూయబడ్డాయి. దీప, సులక్షణలు విమానం దగ్గరికి వస్తున్నారు.

అదే క్షణంలో కదిలింది అంబులెన్స్. మరుక్షణమే దీప చప్పున వెనుదిరిగి దానివైపు పరుగెత్తింది.

"దీపా!" అని అరచిన సులక్షణ కేక, "ధన్"మన్న రివాల్వర్ శబ్దంతో కలిసిపోయింది.

వీపులో గుండుతో రన్‌వేమీద బోర్లాగ పడిపోయింది దీప. రక్తం ధారలయింది.

అంబులెన్స్ క్షణకాలం ఆగి, తిరిగి బయలుదేరింది.

నిలువు గుడ్లేసుకుని చూస్తున్న సులక్షణ భారంగా విమానంలోనికి నడిచింది. ఆమె లోనికి రాగానే తిరిగి తలుపులు బంధించబడ్డాయి.

మైక్రోఫోన్ స్విచాన్ చేశాడు నంబరు వన్.

"మిస్టర్ కంట్రోలర్! మా హెచ్చరిక పాటించనందుకు ఎయిర్ హోస్టెస్ ఒకామె ప్రాణాలు పోగొట్టుకుంది. ఈ రాత్రి సరిగ్గా ఎనిమిదిన్నరకి మా కోరికలు తెలుపుతామని ఇండియా గవర్నమెంటుకి తెలియచేయండి. అంతవరకు...నో మోర్ ఎటంప్ట్స్!" అన్నాడతను.

వెంటనే భారత ప్రభుత్వంతోపాటు, బ్రిగేడియర్ బృందానికికూడా ఈ విషయం తెలియ చేయబడింది.

14

కాబూల్ విమానాశ్రయం వాతావరణంలో మార్పేమీ లేదు. ఈ మధ్య కాలంలో మాత్రం సులక్షణచేత మాట్లాడించాడు నంబర్ వన్.

ఆమెకు ఏమేమి చెప్పాలో చెప్పి మైక్రో ఫోన్

అందించాడు. పీపుల్లో రివాల్వర్ మొనగుచ్చుకుంటుండగా చిన్నగా వణుకుతున్న గొంతు విప్పింది ఆమె.

"ఇక్కడ పాసింజర్స్ పరిస్థితి, మా పరిస్థితి చాలా దారుణంగా ఉంది. హైజాకర్స్‌వద్ద స్టెన్‌గన్స్, గ్రెనేడ్స్ రివాల్వర్స్ ఉన్నమాట నిజం. వారు చెప్పినవి చేయక పోతే చాలా భయంకర సంఘటన జరుగుతుంది. ఈ సంగతి వెంటనే ఇండియాకి తెలియచేసి, మమ్మల్ని రక్షించగోరుతున్నాం!" అంది సులక్షణ.

ఆమెవద్దనుంచి ఫోన్ లాక్కున్నాడు నంబర్ వన్. తిరిగి పాసింజర్స్ కాబిన్‌లోనికి పంపబడిందామె.

ఇండియా గవర్నమెంటుని మరింత భయభ్రాంతుల్ని చేయాలన్న ఉద్దేశ్యంతోనే సులక్షణని మాట్లాడనిచ్చాడు నంబర్ వన్. అతనూహించినట్లే, అతను చెప్పిన విధం గానే చెప్పటమేగాక, తెలివిగా సద్వినియోగం చేసు కుందికూడా సులక్షణ.

అంతకు ముందు అంబులెన్స్ డ్రయివర్ దూరంగా నిలబడి ఉండటంవల్ల హైజాకర్స్‌కి వినబడకుండా అత నితో మాట్లాడే అవకాశం కుదరలేదు. కాని యిప్పుడిలా మైక్రో ఫోనులో స్టెన్‌గన్స్ మొదలయిన ఆయుధాల ప్రసక్తి తిసుకురావటం ఎందుకంటే, దుండగులవద్ద ఏయే ఆయుధాలున్నాయో తెలియచేయటం కోసమే.

తమని రక్షించటానికి భారత ప్రభుత్వం ఏవో ప్రయ త్నాలు చేస్తారని తెలుసు. సాధ్యమైనంతవరకు వివరాలు అందిస్తే మంచిదన్న అభిప్రాయంతో అలా ప్రవర్తిం చింది ఆమె.

సిక్ పీపుల్‌ని బయటికి పంపించి వేయటంతో కొంత మంది పాసింజర్స్‌లో ఆశ చిగురించింది. ఎవరికి వారే

తాముకూడా సిక నెస్‌కి లోనయినట్లు ప్రవర్తిస్తూ సులక్షణని వత్తిడి చేయసాగారు.

ఈ సంగతి తెలిసి చెంప పగిలేటట్లు కొట్టాడు నంబర్ వన్. "నో మోర్ ట్రిక్స్!" అని అరవటంతో అదిరి పోయారు ప్రయాణికులు.

ఈలోగా బయటపడిన ప్రయాణికురాలిద్వారా లోపల వున్న దుండగుల వివరాలు తెలుసుకోవటానికి ప్రయత్నించి విఫలు లయ్యారు అధికారులు.

మెంటల్‌గా హిస్టీరియన్‌కి గురయ్యిన ఆమె వారుకోరిన వివరాలు అందించకపోవటమేగాక, లోపలి దుండగుల సంఖ్యనుకూడా యితమిద్ధంగా చెప్పలేక పోవటంతో నిరాశాపూరిత వాతావరణం అలుముకొంది.

మధ్యాహ్నమవటంతో నంబర్ వన్ తన సహచరులతో చర్చించి, ప్రయాణికుల భోజనాలకు ఏర్పాట్లు కావించాడు.

అతను ఆజ్ఞాపించిన విధంగా ఒక డెలివరీ వ్యానువచ్చి, పెద్ద బాస్కెట్లలో భోజన పొట్లాలను, బ్రెడ్, జామ్ మొదలయిన వాటిని అందించి వెనుదిరిగి పోయింది.

సులక్షణ వాటిని అందరికు పంచింది. విపరీతమైన ఆకలితో వుండటంవల్ల అందుకోక తప్పలేదు వారికి.

తన మనుషులను ముట్టుకోనివ్వలేదు నంబర్ వన్. "వాటిలో ఏదయినా కలిపి వుండొచ్చు!" అంటూ, విమానంలోనే మిగిలివున్న బ్రెడ్, బటర్‌తోనే తమ ఆకలి తీర్చుకున్నారు వాళ్ళు.

అదే సమయంలోనే బ్రిగేడియర్ బృందం వున్న విమానం కాబూల్ విమానాశ్రయం రన్‌వే మీద దిగ నారంభించింది.

15

దూరంగా కనబడుతున్న విమానాన్ని బైనాక్యులర్స్ ద్వారా పరీక్షించాడు బ్రిగేడియర్ విశ్వనాథ్.

పవర్‌ఫుల్‌ది కావటంవల్ల లోపల మనుషుల కదలికలు కిటికీ అద్దాలద్వారా అస్పష్టంగా కనబడుతున్నాయి.

"మైగాడ్! విమానం పేలిపోకుండా వాళ్ళింకా బ్రతికే వున్నారంటే...రియల్లీ ఏ మిరాకిల్!" కామెంటు చేశాడు కేప్టెన్ డిసౌజా.

ఎయిర్‌పోర్ట్ జనరల్ మేనేజర్ వారికి విషయం అంతా వివరించాడు.

హాస్పిటల్లో వున్న పేషెంటుద్వారా ఏ విషయమూ తెలిసే అవకాశం లేకుండా ఆమె అంతిమశ్వాస విడిచింది.

దీప, రామకృష్ణన్‌ల శవాలు చూసి దుండగులు ఎంత క్రూరులో అర్థం చేసుకుంది బ్రిగేడియర్ బృందం.

"వెంటనే కొంతమంది మనుషులను ఆ విమానానికి దూరంగా చుట్టూ పంపించండి. పవర్‌ఫుల్ బైనాక్యులర్స్‌తో విమానంలోని స్థితిని గమనిస్తూ ఎప్పటికప్పుడు మాకు రిపోర్టు చేసేలా వుండాలి. ఎట్టి పరిస్థితులలోను తమని గమనిస్తున్నారన్న భావం హైజాకర్స్‌కి కలగకుండా మెలగాలి. అలాగే ఒక హెలికాప్టరును మాకు కేటాయించండి. ఏరియల్ సర్వే చేయాలి!" అన్నాడు విశ్వనాథ్.

"ఎలా... వారికి అనుమానం రాదూ?"

"రాకుండా ప్రవర్తించాలి" అంటూ అతని చెవిలో ఏదో చెప్పాడు బ్రిగేడియర్ విశ్వనాథ్.

వెంటనే అతనుకోరిన ఏర్పాట్లు క్షణాలమీద కావించబడ్డాయి. ఇద్దరు, ముగ్గురుగా చీలిన కొంతమంది మనుషులు ఎయిర్‌పోర్ట్‌లో దూరంగా వెళ్ళి విమానంచుట్టు కమ్ముకో

సాగారు. ప్రతివారికీ వాకీ-టాకీలు సమకూర్చబడ్డాయి.

హెలికాప్టరు తమమీదుగా ఎగిరిపోవటం చూసి ఎగి రాడు నంబర్ వన్.

"నెవర్ మైండ్ మిస్టర్! అది ఎయిర్ పోర్టు అథారిటీస్ హెలికాప్టర్. రన్ వే - త్రీ వన్, చివర ఏదో డామేజి అయితే పరీక్షించటానికి వెళుతున్నారు" అని జవాబు యిచ్చాడు గ్రౌండ్ కంట్రోలర్. రన్ వే చివరకు చేరు కోవటానికి హెలికాప్టరు ఉపయోగిస్తుంటారు సామా న్యంగా. అందువల్ల తక్కువ సమయం పడుతుంది.

నంబర్ వన్ కి నమ్మక తప్పలేదు. "సరే! రూటు మార్చండి. మా విమానం మీదుగా రాకూడదు" అంటూ ఆంక్షలు విధించాడు.

16

రాత్రి ఏడు గంటలకి మరలా హైజాకర్స్ నుంచి మెసేజ్ అందింది.

అరగంట తరువాత ఉదయం అందించిన విధంగానే భోజనపు పొట్లాలు అందించబడ్డాయి.

వాళ్ళ ధోరణి ఎయిర్ హోస్టెస్ కే కాదు, ఎవ్వరికీ అర్థం గాలేదు. తమని ఎంతకాలం యిలా బంధించి వుంచు తారు? అసలు వాళ్ళు కోరేదేమిటి? ఇలాంటి ఆలోచనలు ప్రతివారిలోనూ తొలుస్తున్నాయి.

నంబర్ వన్ ధోరణిలో మార్పు వచ్చినట్లు కనబడటం లేదు. తమ షరతులకి ఇండియా ఒప్పుకుంటుందన్న నమ్మకం అతనికి దృఢంగా వుంది. అంగీకరించకపోతే ఎలాగూ "ఆయుధాలు" వున్నాయి.

జోగిందర్ నికూడా పాసింజర్సుతో కలిపి కూర్చో నిచ్చారు. విమానం లోపల డిమ్ గా వెలుగుతున్నాయి

లైట్లు.

తనీ రాత్రికి ఎనిమిదిన్నరకి తమ షరతులను చెబుతా నన్న విషయం నెంబర్ వన్ కి గుర్తుంది. టైం చూస్తు న్నాడు, భోజనం ముగించి.

ఏడూ నలభై అయిదు.

అదే సమయంలో బయట దూరంగా—

రన్ వేకి చుట్టూ చీకటిగా వుంది. సాధారణంగా వెలుగుతుండవలసిన లైట్లుగాని, విమానాశ్రయంలోని అత్యధిక భాగం లైట్లుగాని వెలగటంలేదు. ఆ రాత్రి సర్వీసుల నన్నింటిని రద్దుచేసి, నిర్మానుష్యం చేశారు.

ఆ సమయంలో నే కొన్ని ఆకారాలు విమానం చుట్టూ ముడుతున్నాయి, నేలమీద పాకుతూ. నల్లని వారి దుస్తుల వల్ల వారి ఉనికి ఆ చీకటిలో కన్పించటంలేదు.

ప్రతివారి చేతులలో ఏవో ఆయుధాలున్నాయి. ఊపిరి మెల్లగా విడుస్తూ ఏమాత్రం అలికిడి కాకుండా ముందుకి పాకుతున్నారు పాముల్లా.

పేపర్ కప్ లో నీరుతాగి, దానిని పడవేసి, పైలెట్ సీటులో కూర్చుని ఎయిర్ పోర్టు బిల్డింగ్స్ వంక చూశాడు నంబర్ వన్. చాలావరకు క్రీనీడలో వుంది.

టైం చూసుకున్నాడు. ఎనిమిది గంటల పదిహేడు నిముషాలు.

అతని భృకుటి ముడిపడింది.

చటుక్కున ఫోన్ నొక్కి గ్రాండ్ కంట్రోలరుని పిలిచాడు.

"వాట్స్ రాంగ్ విత్ యు? మీరేదో కుట్ర చేయ బోతున్నారు. డామిట్! విమానాన్ని పేల్చేస్తాం!"

"నో! నో!" అరిచాడు కంగారుగా కంట్రోలర్.

"ఏమయింది?"

"నాన్సెన్స్! ఎయిర్ పోర్టు అంతా చీకటిగా వుంది. ఎందువల్ల?"

"సారీ మిస్టర్! బయట వాతావరణం మారింది. తుఫాను రావచ్చని వెదర్ రిపోర్టులు చెబుతున్నాయి. కనీసం ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చని అంచనా. అందువల్ల ముందుజాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఈ సంగతి మీతో చెబుదామనుకుంటుండగానే నీవే ఫోన్ చేశావ్!"

ఆ సమయంలోనే ఎక్కడో తళుక్కున మెరుపు మెరిసింది. దాని వెంటనే ఉరుము వినబడింది.

ముందున్న అద్దాలగుండా బయటికి చూశాడు. ఆకాశంలో నల్లటి మేఘాల తెరలు పల్చగా అలుముకొంటున్నాయి.

"దానివల్ల మాకేమన్న ప్రమాదం వుంటుందా?"

"చెప్పలేను. దాని తీవ్రత గురించి ఇంకా అంచనా వేయలేదు" అన్నాడు కంట్రోలరు.

ఆకాశంలో ఉరుములు, మెరుపులు అధికమవుతున్నాయి.

17

"రైట్! ప్లాన్ ప్రకారం నడుస్తోంది!" అన్నాడు ప్రకాష్ ముంగుకి పాకుతూ. ఫోన్‌లో తమకు జరిగిన సంభాషణ సారాంశం కంట్రోలరు నుంచి వాకీ-టాకీలో తెలుపబడింది.

క్రమంగా ఉరుము, మెరుపులు దగ్గరవ్వటం గమనించాడు నంబర్ వన్.

మేజర్ ప్రకాష్ వెనుక వున్న మనుషులలో ఒకరు

పిస్టలుని ఆకాశంలోకి పేల్చారు. శబ్దం చేయకుండా గోలీ వంటి వస్తువు ఆకాశంలోకి దూసుకుపోయి ఉరుములాగా పేలింది. దానితోపాటే కాంతికూడా ఉత్పన్నమయింది మెరుపులాగా.

ఆ సరికి విమానంని సమీపించింది బ్రిగేడియర్ బృందం.

విమానం చుట్టూ గోడలమీదకి మడిచివున్న లాడర్లను ఎక్స్పాండ్ చేసి వేశారు.

బయట వాతావరణం చూస్తుంటే నిజంగా తుఫాన్ వచ్చే ముందు వుండే వాతావరణంలా వుంది.

ఇవేమీ గమనించలేదు నంబర్ వన్.

మైక్రోఫోన్ లాక్కుని చెప్పసాగాడు. "సరిగ్గా ఎనిమిదిగంటల ముప్పై నిముషాలయింది. మా షరతులని చెబుతున్నాను. జాగ్రత్తగా నోట్ చేసుకో. వానిని ఇండియాకి తెలపాలి. ఈ రాత్రి సరిగ్గా పదకొండు గంటలకు నాకు సమాధానం కావాలి, అంగీకరించినదీ, లేనిది. పదకొండు గంటలకి ఒక్క నిముషం ఆలస్యం అయినా విమానంని పేల్చేస్తాం. జాగ్రత్తగా ఆలోచించి మెలగండి. నా...అవర్ టర్మ్స్...!" అంటున్నాడతను.

అదే క్షణం భయంకరమైన శబ్దంతో విమానం దద్దరిల్లిపోయింది. గజగజ వణికింది విమానం.

పిడుగు పడిందా, భూమి చీలిందా-అన్న అనుభూతికి లోనయ్యారు విమానంలోని వాళ్ళు.

హైజాకర్స్ తేరుకొనే లోపే - రియర్ డోర్ ధడాలున తెరుచుకుని - విశ్వనాథ్ లోనికి ఉరికాడు.

అదిరిపడ్డారు అందరు.

బ్రిగేడియర్ విశ్వనాథ్ లోనికి దుమకట మేమిటి,

దగ్గరలోనున్న నల్లని ముసుగుమనిషికి గురిచూసి కాల్చట మేమిటి క్షణకాలంలో జరిగిపోయింది. అదే వూపులో దొర్లుకుంటూ పోయి సీట్లమధ్య వున్న భారీ ప్రదేశంలోకి చేరుకున్నాడతను.

కాక్‌పిట్టు లోనికి పోబోతున్న నంబర్ టూ గిర్రున వెనుదిరిగి, విశ్వనాథ్‌ని గమనించి స్టెన్‌గన్ ఎత్తబోతు న్నాడు.

విశ్వనాథ్ క్షణంకూడా ఆలస్యం చేయలేదు. అలా పడివుండే నంబర్ టూకి గురిచూసి ట్రిగ్గర్ నొక్కాడు. ఒళ్ళంతా తూట్లుపడి నిలువునా కూలిపోయాడు అతను.

ప్రయాణీకులకి మాత్రం ఏం జరుగుతుందో ఎంత మాత్రమూ అర్థంకాలేదు. విచక్షణాజ్ఞానం నశించిన బుర్ర లతోని స్తేజంగా కూర్చుండిపోయారు.

వెనక జరుగుతున్న కాల్పులు గ్రహించాడు నంబర్ వన్. అతని హృదయం భగ్గున మండింది. చేతికి అంది వచ్చిన ఫలం నోటికందకుండా పోతుందనే ఆవేశంలో క్రుద్ధుడయాడు.

చప్పున ప్రక్కన వున్న కిట్‌లోనుంచి హేండ్ గ్రనేడ్ తీసి, నోటితో ఫ్యూజ్‌ని లాగి పాసింజరు కాబిన్ వేపు విసరబోయాడు.

అదే క్షణంలో ఫ్రంటు డోర్ ధడాలున తెరుచుకుని సుడిగాలిలా లోనికి ప్రవేశించిన మేజర్ ప్రకాష్ గ్రనేడ్‌ని అందుకొని కిటికీలోంచి దూరంగా విసిరేశాడు చేతి బలంకొద్దీ. ఫెటిల్లుమనే బ్రహ్మాండమయిన శబ్దంతో ప్రేలిపోయింది అది.

ఆ క్షణంలోనే విమానంని చుట్టుముట్టి లోనికి ప్రవే శించారు మిగిలిన మనుషులు.

నంబర్ వన్ మరింత క్రుద్ధుడై కాలితో ప్రకాష్ పొట్టలో తన్నాడు. ఆ అదుటుకి వెళ్ళి ఒక మూలపడ్డాడతను.

జేబులోనుంచి కత్తి తీసి బ్లేడ్‌ని తెరిచి ప్రకాష్‌వైపు విసిరాడతను. చప్పున ప్రక్కకి తప్పుకుని, అదే వూపులో ఎగిరివచ్చి నంబర్ వన్ ముఖంమీద తన్నాడు ప్రకాష్.

'కేవ్' మని అరుస్తూ తెరిచివున్న డోర్‌లో నుంచి క్రిందకు పడిపోయాడు నంబర్ వన్.

అతను నేలని తాకకముందే ప్రకాష్ చేతిలోని రివాల్వరు గర్జించింది.

నిర్జీవమైన శరీరం దబ్బుమని పడింది నేలమీద.

''ఆపరేషను ఓవర్!'' అన్నాడు వాకీ-టాకీలో విశ్వనాథ్.

మరుక్షణంలోనే ఉరుములు, మెరుపులు ప్రొడ్యూస్ చేస్తున్న మనుషులు, ఆకాశంలోకి నల్లని పొగని పంపింగ్ చేస్తున్న వ్యక్తులు, తమ తమ పనులను మానేసి, కార్ల వైపు పరుగెత్తారు.

*   *   *

ఇసుకలో ఆగిపోయిన విమానం చుట్టూ శక్తివంత మయిన ఫ్లడ్ లైట్లు వెలుగుతున్నాయి.

డజన్లకొద్దీ కార్లు ఆంబులెన్సులు, ఫైర్ యింజన్సు వున్నాయి అక్కడ.

లోపల వున్న ప్రయాణీకుల్ని స్ట్రెచర్లమీద ఆంబులెన్స్ లోనికి చేరుస్తున్నారు.

దూరంగా నిలబడి ఇదంతా చూస్తూ సిగరెట్టు తాగుతున్నారు బ్రిగేడియర్ విశ్వనాథ్, మేజర్ ప్రకాష్.

పత్రికా విలేఖరులు వారిని సమీపించాలని ప్రయత్నించి

విఫలులయిపోయారు. వారిని తరువాత కలుసుకుంటామని మాట ఇచ్చారు వాళ్ళు.

దాదాపు 19 గంటలపాటు విమానంలో చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడిన ప్రయాణికులలో మళ్ళీ జీవకళ వచ్చింది. ఒకరినొకరు కౌగిలించుకొని బావురుమంటున్నారు.

సులక్షణ నెమ్మదిగా బ్రిగేడియర్ వద్దకు వచ్చింది. "థాంక్స్!" అంది నెమ్మదిగా. నవ్వుతూ ఆమె భుజం తట్టాడు విశ్వనాథ్.

—: ఐపోయింది :—